క్లుప్తంగా

పరీక్ష కేంద్రం పరిశీలన



గురజాల : ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ మీసాల దానియేలు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పల్లెగుంత ఏపీ మోడల్ పాఠశాలలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 333 మంది విద్యార్థులకు 313 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఎస్వీ కృష్ణారెడ్డి, పల్లెగుంత మోడల్ పాఠశాలలో 344 మంది విద్యార్థులకు 338 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఉషశ్రీ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. 1,200 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

ప్రజల వద్దకే వైద్యం



దాచేపల్లి : ఇంటివద్దకే వైద్యం అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సుచరిత చెప్పారు. మండలంలోని ముత్యాలంపాడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె ప్రజలకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, జ్వరం, దగ్గు, ఆయాసం తదితర వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. డాక్టర్ సుచరిత మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, ఏఎన్ఎం శివమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత



మాచర్ల: పట్టణంలో తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. ఓ బాలుడు స్థానిక శ్రీనివాస మహాల్ దగ్గర ఏడుస్తుండగా పురపాలక సంఘానికి చెందిన ఓ మహిళా కార్మికురాలు గుర్తించింది. అతడిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించింది. విధుల్లో ఉన్న పోలీసులు బాలుడి వివరాలు సేకరిస్తుండగా తమ కుమారుడు తప్పిపోయాడని తండ్రి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. దీంతో బాలుడ్ని అతడి తండ్రికి పోలీసులు అప్పగించారు.

పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

కారెంపూడి: కారెంపూడి మేజర్ గ్రామ పంచాయతీలో రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న పాలువాయి వెంకాయమ్మ (55) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకాయమ్మ శుక్రవారం ఉదయం నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లగా అక్కడ ఆమె మృతి చెందింది. ఆమె 24 ఏళ్లుగా గ్రామ పారిశుద్ధ్య కార్మికురాలిగా సేవలందించారు. వెంకాయమ్మ మృతి పట్ల గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, పాలక వర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. ఆమెకు భర్త ఏసుపాదం, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

రెంటచింతలలో యువకుడి మృతి



రెంటచింతల: రెంటచింతలలోని నాయుడుపేట ఎస్సీ కాలనీలో ఓ యువకుడు మూర్ఛ వ్యాధితో కిందపడి మృతి చెందాడు. ఎస్‌ఐ సయ్యద్ షమీర్‌బాషా కథనం ప్రకారం.. కాలనీకి చెందిన వడ్డే వెంకటకుమార్ (33) గురువారం రాత్రి ఆంతోనివారి కాలనీలోని తన కారులో నిద్రించాడు. తెల్లవారుజామున కారు పక్కన ఉన్న డ్రెయినేజ్ కాలువ వద్ద పడి మృతి చెంది ఉన్నాడు. వెంకట కుమార్ స్వగ్రామం నాగార్జునసాగర్ కాగా అత్తగారి ఇంటి వద్ద కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. వెంకటకుమార్‌కు మూర్ఛ వ్యాధి ఉందని, రాత్రి కారు నుంచి కిందకు దిగి పడి మృతి చెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతునికి భార్య ఝాన్సీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతని తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతుకందిన పంట

- 'మెట్టనింట' సిరులు
- ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి
- ధర కూడా ఆశాజనకం
- ఆర్‌బీకేల ప్రోత్సాహంపై కర్షకుల హర్షం



విరగకాసిన కంది పంట

దుర్గి: మెట్టప్రాంతంలో కంది పంట విరగపండింది. రైతుల కళ్లల్లో ఆనందాలు పూయిస్తోంది. పల్నాడు ఎగువ ప్రాంతంలో పూర్తిగా వర్షాధారంగానే పంటలు సాగవుతాయి. అక్కడక్కడ అరకొరగా బోరుబావులు ఉంటాయి. ఇలాంటి ప్రాంతంలో రబీ సీజన్ కంది రైతులకు కలసివచ్చింది. కర్షకుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. ప్రస్తుతం కంది కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

255 హెక్టార్లలో..

దుర్గి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పత్తిపంటను వేసిన రైతులు రబీలో కందిని విస్తారంగా సాగుచేశారు. సుమారుగా 255 హెక్టార్లలో కందిపంట సాగైంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, స్థానిక రైతు భరోసా కేంద్రాల ప్రోత్సాహం, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించడం వల్ల దిగుబడి బాగా వచ్చింది. ఎకరానికి 8 నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. దీనికితోడు మద్దతు ధర కూడా ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం క్వింటాలుకు రూ.7500ల నుంచి రూ.8వేల వరకు ధర పలుకుతోంది. ఎకరాకు ఖర్చులు పోను రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రైతులకు మిగులుతున్నట్టు తెలుస్తోంది.

కోత తర్వాత ఐదు రోజులు ఆరబెట్టండి



కంది రైతులు కోత కోసిన తర్వాత ఐదురోజులపాటు పంటను ఆరబెట్టాలి. అప్పుడు మార్కెట్‌కు తీసుకొస్తే మంచి ధర వస్తుంది. మన ప్రాంతంలో 30కిపైగా దాల్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం వందల టన్నుల కందుల అవసరం ఉంది. మిల్లులు బర్మా నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. మన ప్రాంతంలో నాణ్యమైన పంటను పండిస్తే మంచి ధరకు కొనుగోలు చేస్తాం.

– కపలవాయి వెంకటప్పయ్య, దాల్ మిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మాచర్ల, దుర్గి

అందుబాటులో ఆర్‌బీకేలు



కంది రైతులకు ఆర్‌బీకేలు అందుబాటులో ఉంటున్నాయి. సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగులోనూ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది కంది పంట దిగుబడి బాగుంది. మద్దతు ధర కూడా లభిస్తోంది.

– అమీర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, దుర్గి

25 క్వింటాళ్ల దిగుబడి



నా పేరు యతిరాజుల శ్రీనివాసరావు. మాది ఆత్మకూరు గ్రామం. వ్యవసాయధార కుటుంబం. పత్తి పంట పూర్తయిన తరువాత రబీ సీజన్‌లో అక్టోబర్‌లో మూడు ఎకరాల్లో కంది దత్తార్ 48 రకం విత్తనం నాటాను. ఐదునెలల తరువాత ప్రస్తుతం పంట చేతికొచ్చింది. సుమారుగా 25 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. అన్ని ఖర్చులు పోను ఎకరాకు సుమారుగా రూ.25 వేలు మిగులుతుంది. ఆనందంగా ఉంది.

– యతిరాజుల శ్రీనివాసరావు, రైతు

స్థాయి మరిచి విమర్శలా..!

- ఏడు హత్యలు చేస్తే గొప్పా?
- రెండు సార్లు ఓడినా.. ప్రగల్భాలా?
- వార్డుమెంబర్‌గా కూడా గెలవలేని చరిత్ర జూలకంటిది
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్

మాచర్ల: వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థాయి మరిచి తమ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మూడు జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) ధ్వజమెత్తారు. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను పలువురు నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అమ్మానాన్న పేరు చెప్పుకుని బతికే జూలకంటి.. ఐదుసార్లు అప్రతిహతంగా ఎమ్మెల్యేగా గెలిచిన పిన్నెల్లిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. 2010లో సొంత బంధువులు ఏడుగురిని హత్య చేసిన జూలకంటి అదే గొప్పను కుంటున్నారని, చాలాకాలం నియోజకవర్గానికి దూరంగా బతికిన ఆయన ఇప్పుడు టీడీపీ పెయిడ్ ఆర్టిస్టుగా మారారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే పిన్నెల్లి కుటుంబంపై రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన జూలకంటి స్థాయి మరిచి ప్రగల్భాలు పలుకుతున్నారని పీవీఆర్ విమర్శించారు. యరపతినేని, చంద్రబాబు, లోకేష్ దగ్గర ప్యాకేజీ తీసుకున్న జూలకంటి ఇలాగే ఇష్టమొచ్చినట్లు మొరిగితే ఊరుకునేది లేదని, ప్రజలు ఎలాగూ మరోసారి ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు రూప్లీ బాలునాయక్, పెద మల్లుస్వామి, సర్పంచ్‌లు ఓరుగంటి చిన్నా, సైదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, తోట ఆంజనేయులు పాల్గొన్నారు.

వానతో రైతుల ఆందోళన



మిర్చి కల్లాల్లో కప్పిన పట్టాలపై నిలిచిన నీరు



మాచవరంలో మిర్చిపై కప్పిన పట్టాలు

కారెంపూడి: మండలంలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రమే చిరు జల్లులు పడడంతో కల్లాలలో ఉన్న మిర్చి, మొక్కజొన్నలు తడవకుండా వాటిపై రైతులు పట్టాలు కప్పారు. వేకువ జామున ఒక మోస్తరు వర్షం పడడంతో కల్లాలపై కప్పిన పట్టాలపై నీరు నిలిచిపోయింది. రెండు గంటల తర్వాత కొంచెం ఎండ పొడ రావడంతో పట్టాలపై నీటిని రైతులు బయటకు పారబోశారు. ఆ తర్వాత ఎండ రావడంతో కల్లాలలో ఉన్న మిర్చి, మొక్కజొన్నలను ఆరబెట్టారు. శుక్రవారం సాయంత్రం మళ్లీ చిరుజల్లు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

మాచవరం మండలంలో

మాచవరం: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురవడంతో రైతులు ఆందోళన చెందారు. కల్లాల్లో ఉన్న మిర్చి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. ఇదిలా ఉంటే పలు గ్రామాల్లో కాపు దశలో ఉన్న మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తినష్టం గానీ సంభవించలేదని అధికారులు తెలిపారు.

సైదానాయక్ కుటుంబానికి అండగా ఉంటాం



సైదానాయక్ కుటుంబీకులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేస్తున్న పీవీఆర్

మాచర్ల రూరల్: పిడుగుపాటుకు గొర్రెల కాపరి రామావత్ సైదానాయక్ మరణించడం ఎంతో బాధించిందని, అతని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని చింతలతండా గ్రామంలో పిడుగుపడి గొర్రెల కాపరి సైదానాయక్ మృతిచెందిన విషయం తెలిసిందే. అతడి కుటుంబీకులను శుక్రవారం పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. సైదానాయక్‌తోపాటు 50 గొర్రెలు మృతి చెందటం తమను కలచివేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని అందజేస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పోతురెడ్డి కోటిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

పీవీఆర్ పరామర్శ

కారెంపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శుక్రవారం సాయంత్రం కారెంపూడిలో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులను పరామర్శించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య తండ్రి వెంకట నర్సయ్యను పరామర్శించి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని ధైర్యం చెప్పారు. అలాగే ప్రమాదంలో గాయపడిన ఎస్సీ సెల్ నాయకుడు జొన్నలగడ్డ శ్రీనివాస్‌ను పరామర్శించారు. మరి కొందరు పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు పాలువాయి వెంకాయమ్మ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, టౌన్ వీరారెడ్డి, ఎంపీపీ మేకల శ్రీనివాసరెడ్డి, షేక్ అక్బర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, చల్లా వీర్ల వరప్రసాద్, కొమ్మిరెడ్డి ఎర్ర గురవారెడ్డి, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, అంతరగడ్డ ఏసోబు, కొమ్ము చంద్రశేఖర్ పీవీఆర్ వెంట ఉన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి తిరునాళ్ల



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మాచర్ల రూరల్: కొత్తపల్లి గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి బొప్పూడి గిరిశర్మ నేతృత్వంలో ఆలయ ధర్మకర్త అల్లం కోటిరెడ్డి పర్యవేక్షణలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, ఉపసర్పంచ్ కొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు హనిమిరెడ్డి, బాలిరెడ్డి, పి.శంకర్‌రెడ్డి, వీరంశెట్టి ఆదినారాయణ, సత్యనారాయణరెడ్డి, పున్నారెడ్డి, అల్లం వెంకట కోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి, సుబ్బయాచారి, మేడం భాస్కర్‌రావు, ఓరుగంటి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం



బీసీ బాలుర హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం: సమస్యల పరిష్కారానికే గ్రామోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. మోర్జంపాడు గ్రామంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాత్రి బీసీ బాలుర హాస్టల్‌ను శ్రీకృష్ణదేవరాయలు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గ్రామ సచివాలయంలో పల్లె నిద్ర చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. కల్లాల్లో ఉన్న మిర్చి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఈఓఆర్డీ వెంగళరావు, గ్రామ సర్పంచ్ కృష్ణవేణి నరసింహారావు, ఎంపీటీసీ ముంగి మంగమ్మ శివరామయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోండి



మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో అనేక సంవత్సరాలుగా బకాయిలు ఉన్న వారు ఈ నెల 31వ తేదీ లోపు వడ్డీ లేకుండా ఒకేసారి సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు కోరారు. శుక్రవారం పట్టణంలో ఆయన పురపాలక సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని రకాల పన్నులకు రాయితీ అవకాశం ఉందని వివరించారు. అలాగే ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఇప్పటికి రూ.2.50 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించేందుకు తోటి ప్రభుత్వ శాఖ అధికారులూ సహకరించాలని కోరారు.

వడ్డీ లేకుండా పన్నులు చెల్లించండి

పిడుగురాళ్ల: పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలం పన్ను చెల్లింపుదారులు వడ్డీ లేకుండా కట్టవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. 2022-2023 సంవత్సరానికి ఏకమొత్తంగా అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చునని వెల్లడించారు. ఈ అవకాశం ఈనెల 31 వరకు ఉందని పేర్కొన్నారు.

పన్నులపై వడ్డీ రద్దు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని పలు రకాల పన్నులపై ప్రభుత్వం వడ్డీ రద్దు చేసిందని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ఇంటి, ఖాళీ స్థలాల, నీటి పన్నులతోపాటు షాపుల అద్దెలకు సంబంధించిన బకాయిలకు వడ్డీ రద్దు చేశామని, ఈ నెలాఖరునాటికి అన్ని రకాల పన్నులు నగర పంచాయతీ కార్యాలయం, వార్డు సచివాలయాల్లో చెల్లించి రశీదు తీసుకోవాలని కమిషనర్ కోరారు.

ఆలయ సిబ్బంది సస్పెన్షన్ అవాస్తవం

ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నర్సింహబాబు

దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డికి అందరి భక్తులు మాదిరిగానే ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ మర్యాద కల్పించామని ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు చెప్పారు. శుక్రవారం ఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మాచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేత జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనకు పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులను సస్పెండ్ చేసినట్లు ఆరోపించడం పూర్తిగా అవాస్తమని ఈఓ పేర్కొన్నారు. గతంలో అనేకసార్లు ఆలయాన్ని ఆయన సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయ సన్నిధానానికి వచ్చిన ప్రతిఒక్క భక్తుడికీ అమ్మవారి దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆలయ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ఆరోపించటం తగదని వివరించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇటువంటి చర్యలను ప్రోత్సహించరని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి ఆలయ విశిష్టతను పెంపొందించాలన్నారు. సమావేశంలో ప్రధాన అర్చకులు సిహెచ్ శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదగార్లపాడులో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణకాంత్

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిడుగురాళ్లకు చెందిన స్నేహా పిల్లల హస్పిటల్ వైద్యుడు గుర్రం కృష్ణకాంత్ ఈ శిబిరంలో పాల్గొని 80 మంది పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన చిన్నారులకు మందులు అందించారు. వేసవికాలంలో చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ కృష్ణకాంత్ వివరించారు. శిబిరంలో సర్పంచ్‌లు కటికాల వరలక్ష్మి, పుప్పాల శివ, ఉప సర్పంచ్ కర్పూరపు వెంకట కోటయ్య, ఆర్ఎంపీ వైద్యుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి



గ్రామంలో పర్యటిస్తున్న మండల ప్రత్యేకాధికారి గబ్రునాయక్

మాచర్ల రూరల్: గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి గబ్రునాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని లచ్చమ్మబావి, రేగులవరం తండాలలో ఆయన పర్యటించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఏఈ రామాయణం సురేంద్ర, సర్పంచ్ మాద్యానాయక్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్ఓ నందాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద

జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి



విద్యార్థులతో కలిసి జగనన్న గోరుముద్ద తింటున్న జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి

దాచేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రుచికరమైన ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలని జిల్లా అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి చెప్పారు. తంగెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి జగనన్న గోరుముద్ద పథకం ద్వారా తయారు చేసిన ఆహార పదార్థాలు తిన్నారు. విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు మెనూ ప్రకారం అందించాలని మహాలక్ష్మి సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మాధవీలత, సర్పంచ్ కొత్తపల్లి కాశయ్య, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ప్రధానోపాధ్యాయుడు పిట్టు విజయబాస్కర్‌రెడ్డి, సీఆర్పీ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాశ్రీకృష్ణ పంచలోహ విగ్రహాల సంప్రోక్షణ



పూజలలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: స్థానిక సీతారామాలయంలో కొత్తగా తీసుకువచ్చిన గోదా, శ్రీకృష్ణుని పంచలోహ విగ్రహాల సంప్రోక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన వేద పండితులు ఆర్వీ రామకృష్ణ దీక్షితుల బృందం వేద మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం జరిగింది. సాయంత్రం ఏడు గంటలకు గోదా శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోలా వసంతకుమార్ రెడ్డి, కార్యదర్శి మన్నెపల్లి రామాంజనేయులు, ట్రెజరర్ కామిశెట్టి సత్యనారాయణ, సభ్యులు అమర్ కుమార్, ఏఈ నర్సింహమూర్తి, రంగారావు,జీవీజీ కృష్ణమూర్తి, సాంబశివరావు, ఆదుర్తి నాగరాజు, ఎండీ నాగరాజు కుమార్, సారె కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినకొదమగుండ్లలో ప్రత్యేకాధికారి పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జోసెఫ్‌కుమార్

కారెంపూడి: గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో మండల ప్రత్యేక అధికారి జి.జోసెఫ్‌కుమార్ గురువారం రాత్రి పల్లె నిద్ర చేశారు. గ్రామ సచివాలయంలోనే రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రతి వీధికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వద్ద మురుగు నీరు పోయేదారి లేక ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు కాంపౌండ్‌వాల్ నిర్మించాలని సర్పంచ్ యర్రంరెడ్డి వీరారెడ్డి కోరారు. ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డిని ప్రత్యేక అధికారి ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కీర్తిసుధాస్రవంతి, ఈఓపీఆర్ఆర్డీ పి.సత్యప్రసాద్ గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.